
సాక్షి ఒడిశా
బుధవారం । 25 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ.96,602
బంగారం : 1 గ్రాము 500 మిల్లీ గ్రాములు
వెండి : 19 గ్రాముల 700 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ

మహా యాత్రకు ముస్తాబు

ఈ ఏడాది జరగనున్న పూరీ జగన్నాథ స్వామివారి రథయాత్రకు రథాల తయారీ ముగింపు దశకు చేరుకుంది.


- 8లో.



మూల విరాట్‌లకు శ్రీముఖ సేవ

ఆషాఢ అమావాస్య చతుర్దశి పురస్కరించుకొని మూల విరాటులకు మంగళవారం శ్రీముఖ సేవ నిర్వహించారు.

- 8లో.



న్యూస్‌రీల్

పేదల నివాసాలు కూల్చడం సరికాదు



మాట్లాడుతున్న మాజీ మంత్రి రమేష్ మజ్జి

కొరాపుట్: పేదల నివాసాలు కూల్చడమే ప్రభుత్వ లక్ష్యమా అని బీజేడీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి, మాజీమంత్రి రమేష్ చంద్ర మజ్జి ప్రశ్నించారు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్‌లోని తన నివాసంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ప్రసంగించారు. గత పది రోజుల్లో జిల్లాలో అనేక చోట్ల పేదల నివాసాలు కూల్చేయడం సరికాదన్నారు. రాయిఘర్ సమితి హత్తబెడాలో 28 మంది పేదల నివాసాలను కూల్చివేయడం దారుణమన్నారు. అదేవిధంగా ఉమ్మర్‌కోట్ సమితిలో పేదల దుకాణాలు, ఇళ్లు కూల్చేశారన్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో పేదలు నిర్మించుకున్న ఇళ్లు కూల్చడంపై అసహనం వ్యక్తం చేశారు. కనీసం ముందస్తు నోటీసులు లేకుండా కూల్చివేతలు జరుగుతున్నాయని మండిపడ్డారు. దీనిపై తమ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

ఆక్రమణలు తొలగించాలని ఆదేశం



ఆక్రమణలు తొలగించాలని ఆదేశిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: స్థానిక హైస్కూల్ జంక్షన్ నుంచి కాలేజీ రోడ్డు, మార్కెట్ జంక్షన్ వరకు ఉన్న దుకాణదారులు బుధవారంలోగా ఆక్రమణలు తొలగించాలని సబ్ కలెక్టర్ అనుప్ పండా ఆదేశాలు జారీ చేశారు. రథయాత్ర జరగనున్న ప్రదేశంలో గుండిచా బడి, చర్చి రోడ్డు వరకు ఉన్న ఆక్రమణలు మంగళవారం తొలగించారు. రానున్న రథయాత్రకు ఎక్కువ మంది భక్తులు రానున్న నేపథ్యంలో జిల్లా సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, పుర పాలక ఈవో లక్ష్మణముర్ము, ఇతర మున్సిపల్ సిబ్బంది ఈ చర్యలు తీసుకున్నారు.

డ్రైనేజీ పనులు ఆపాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: స్థానిక ఎస్‌కేసీజీ కళాశాల హాస్టల్ వద్ద రోడ్డు విస్తరణలో జరుగుతున్న డ్రైనేజీ పనులను ఆపాలని గజపతి జిల్లా బీజేపీ శ్రేణులు రోడ్లు, భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పర్లాకిమిడి టౌన్ రోడ్డులో భాగంగా అగ్నిమాపక దళం జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. అయితే ఖంజావీధి నుంచి కాలేజీ రోడ్డు జంక్షన్ వద్ద జరుగుతున్న డ్రైనేజీ పనులపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అందువల్ల ప్రస్తుతం జరుగుతున్న పనులను ఆపాలని బీజేపీ నాయకులు బాలకృష్ణ పాత్రో, బబునా బెహరా, సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో తదితరులు వినతిపత్రం ఎస్‌ఈ అభిషేక్ శెఠికి అందజేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణిమా సాహు, ఇందిరా పట్నాయక్, ఎంపీ ప్రతినిధి దారపు రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి పాణిగ్రాహికి అవార్డు



అవార్డు అందుకుంటున్న తిరుపతి పాణిగ్రాహి

పర్లాకిమిడి: రాష్ట్రంలో ప్రథమ ప్రైవేటు ఆస్పత్రి హైటెక్ మెడికల్ కళాశాలల చైర్మన్ డా.తిరుపతి పాణిగ్రాహి భువనేశ్వర్‌లో టైమ్స్ హెల్త్ ఐకాన్ అవార్డును బాలీవుడ్ నటి రవీనా టాండన్ చేతులమీదుగా అందుకున్నారు. భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో జరిగిన టైమ్స్ ఆఫ్ ఇండియా హెల్త్ ఐకాన్ అవార్డు ఉత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ హరిబాబు కంభంపాటి హాజరయ్యారు. రాష్ట్రంలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో హైటెక్ గ్రూప్ గత పదేళ్లుగా ముఖ్య భూమిక పోషించిందని గవర్నర్ అభినందించారు. హైటెక్ గ్రూప్స్‌లో పనిచేస్తున్న డాక్టర్లు సంజయ్ కుమార్ జంగ్డీ, డా.దీపక్ కుమార్ దాస్, హైటెక్ గ్రూప్ డిప్యూటీ డైరెక్టర్ డా.అనిల్ కుమార్ పాణిగ్రాహి, హృద్రోగ నిపుణులు డీన్ ప్రొ.డాక్టర్ అక్షయ కుమార్ సాహు, ప్రొ.డా.అమ్రిత్ పట్టజోషి, సీఈవో జ్యోతిర్మయి పండా, డా.విక్రం కుమార్ సింగ్‌లు అవార్డులు స్వీకరించారు.

కలకలం..!

- పూరీ ఆలయంలో దశ మూలికల మోదకం దొంగతనం ఆరోపణ
- ఫిర్యాదు చేసిన బలభద్ర స్వామి బాడొగ్రాహి హల్దర్ దాస్
- ఘటనపై చెలరేగుతున్న దుమారం
- ఆరోపణలు అవాస్తవం: సీఏవో అరవింద కుమార్ పాఢి



బాడొగ్రాహి దాఖలు చేసిన ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న సీఏవో డాక్టర్ అరవింద్ కుమార్ పాఢి



జగన్నాథునికి సమర్పించిన దశ మూలిక మోదకాలు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని రథయాత్ర దగ్గర పడుతున్న తరుణంలో స్వామివారి చికిత్స కోసం ఏర్పాటు చేసిన దశ మూలికల మోదక దొంగతనం ఆరోపణ తీవ్ర కలకలం రేపుతోంది. బలభద్ర స్వామి మూల విరాటు బాడొగ్రాహి ప్రత్యక్షంగా శ్రీమందిరం పాలన అధికారికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విచారకర ఘటనపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. అయితే ఈ ఆరోపణ అవాస్తవమని ప్రాథమిక విచారణలో తేలిందని శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి (సీఏవో) డాక్టర్ అరవింద కుమార్ పాఢి తోసిపుచ్చారు. ఆయన అభిప్రాయం ఆధారంగా రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఘాటుగా స్పందించారు. ఈ ఆరోపణ పూర్తిగా అబద్ధమని, స్వీయ ప్రచారం కోసం నిరాధారమైన ఆరోపణగా వ్యాఖ్యానించారు. విచారణలో నిజం నిగ్గు తేలితే తెర వెనక వర్గాలపై చర్యలు తప్పవని బాహాటంగా హెచ్చరించారు. మరోవైపు ఘటనపై బిజూ జనతా దళ్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఇదో విపత్కర ఘటనగా పేర్కొన్నారు. లోగడ ఇటువంటి సంఘటనల దాఖలాలు లేవన్నారు. భగవంతుని విషయంలో రాజకీయం తగదని బీజేడీ నాయకుడు లెనిన్ మహంతి హితవు పలికారు. సీసీ టీవీ రికార్డింగు వంటి అనుబంధ ఆధారాలతో ఆరోపణపై విచారణ పూర్తయితే వాస్తవం తేటతెల్లమవుతుందని శ్రీ మందిరం సీఏవో వెల్లడించారు.

70 మోదకాలు తగ్గినట్లు ఆరోపణ

తెర చాటున చికిత్స పొందుతున్న మూల విరాటులకు ఆలయ ఆచారం ప్రకారం ఒణొసారొ ఏకాదశి పురస్కరించుకుని ఈనెల 21న దశ మూలికా మోదకం సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సేవ కోసం సరఫరా చేసిన 313 మోదకాల్లో 70 దశ మూలిక మోదకాలు తక్కువ ఉన్నట్లు బలభద్ర స్వామి బాడొగ్రాహి హల్దర్ దాస్ మహాపాత్రో గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ మోదకాలు దొంగిలించినట్లు ఆయన ఆరోపించారు. స్వామి సేవకు ముందు వీటిని స్పర్శించడంతో పవిత్రత లోపించినా గత్యంతరం లేని పరిస్థితుల్లో సేవ యథాతథంగా కొనసాగించినట్లు వివరించారు. స్వామి గోప్య సేవల కోసం సరఫరా చేసే మోదకాలను లెక్కించడం జరగదు. అనుబంధ వర్గాలు అందజేసే మోదకాలను యథాతథంగా శ్రీమందిరానికి తరలించడం జరుగుతుంది. సంబంధిత సేవాయత్‌ల సమాచారం ఆధారంగా లాంఛనంగా రికార్డు నిర్వహణ కొనసాగుతుందని శ్రీ మందిరం సీఏవో తెలిపారు. ఈ క్రమంలో సీసీటీవీ రికార్డింగ్ ఆధారంగా వాస్తవం బయటపడే అవకాశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మరోవైపు శ్రీ జగన్నాథుని బాడొగ్రాహి వర్గాలు ఆరోపణని బలపరుస్తున్నాయి. వివాదస్పదమైన ఆరోపణపై విచారణ జరిపేందుకు శ్రీమందిరం ప్రధాన నిర్వాహకుడు, డిప్యూటీ నిర్వాహకుడు మరియు ఆలయ కమాండర్ సభ్యులుగా ప్రత్యేక కమిటీని నియమించారు. విచారణ కాల పరిమితిని స్పష్టం చేయలేదు.

పంచాయతీలుగా గుర్తించండి



బీడీవో కృష్ణచంద్రకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి పరిధి బిజాబొండిలి, హటొశిఖాల్ ప్రాంతాలను పంచాయతీలుగా గుర్తించాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శివపాదొరొ బికాస్ పరిషత్ అధ్యక్షుడు చంద్రశేఖర్ బెహర నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం మంగళవారం బీడీవో కృష్ణచంద్ర దొలొ, అదనపు తహసీల్దార్ సుబేందు సాహులకు వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పంచాయతీలను ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా ప్రజాభిప్రాయాలను సేకరిస్తోందని, దీనిలో భాగంగా మునిగుడ సమితిలోని శివపదర్ పంచాయతీలో భాగమైన బిజాబొండిలి, హటొశిఖాల్‌లను పంచాయతీలుగా గుర్తించగలిగితే ప్రజలు మరిన్ని సౌకర్యాలు పొందే అవకాశం ఉందని వినతిపత్రంలో వివరించారు. జనాభాపరంగా అభివృద్ధి చెందుతున్న శివపదర్ పంచాయతీ మరింత అభివృద్ధి చెందాలంటే కొత్తగా రెండు పంచాయతీల ఏర్పాటు అనివార్యమని పేర్కొన్నారు.

నిందితులకు మూడేళ్ల జైలు శిక్ష

రాయగడ: ఒక మొబైల్ చోరీ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను మూడేళ్ల జైలు శిక్షను విధించారు. అదేవిధంగా మరో రూ.10 వేల జరిమానా చెల్లించాలని ఆదేశించారు. చెల్లించని పక్షంలో అదనంగా మరో 6 నెలలు జైలు శిక్షను అనుభవించాలని వివరించారు. వివరాల్లోకి వెళ్తే.. 2024 అక్టోబర్ 22వ తేదీన ఆర్యన్‌కుమార్ శర్మ, మరో వ్యక్తి జిల్లాలోని శిఖాల్ పోలీస్‌స్టేషన్ క్యాంప్ హౌస్‌లో నిద్రించారు. ఆ సమయంలో కొంతమంది దుండగులు 3 సెల్‌ఫోన్లు దొంగిలించారు. దీనికి సంబంధించి శిఖాల్ పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అక్షయ నాగ్, మోహన్ కుమార్ అనే ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. దీనికి సంబంధించి విచారించిన ఎస్‌డీజేఎం దాస్ ఐదుగురు సాక్షులను విచారించిన అనంతరం నిందితులకు శిక్షను ఖరారు చేశారు.

తనిఖీలు ముమ్మరం



యాత్ర ప్రాంగణంలో నిఘా

భువనేశ్వర్: రథయాత్ర సందర్భంగా పూరీ పట్టణ వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రధానంగా బాంబు పేలుడు తదితర విధ్వంస నిరోధక తనిఖీలు చేపడుతున్నారు. రైల్వేస్టేషన్, బస్టాండు, సాగర తీరం, వసతి సముదాయాలు, యాత్ర ప్రాంగణాలు తదితర కీలక జన సందోహిత ప్రదేశాల్లో పూరీ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు.

ముగిసిన పీఈసీటీఈఏ సదస్సు



ప్రసంగిస్తున్న ఐఐటీ భువనేశ్వర్ డైరెక్టర్ శ్రీపాద కర్మల్కర్

భువనేశ్వర్: స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ సైన్సెస్ నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ పవర్ ఎలక్ట్రానిక్స్ కన్వర్టర్స్ ఫర్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ ఎనర్జీ అప్లికేషన్స్–2025 (పీఈసీటీఈఏ–2025) సదస్సు విజయవంతంగా ముగిసింది. రవాణా మరియు ఇంధన వ్యవస్థల్లో పవర్ ఎలక్ట్రానిక్స్ భవిష్యత్తుపై విద్యావేత్తలు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు ఈ సమావేశంలో చర్చించారు. ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుకుమార్ మిశ్రా సదస్సును ప్రారంభించారు. స్థానిక ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద కర్మల్కర్ మాట్లాడుతూ.. విద్యుత్ మరియు రవాణా రంగాల్లో ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి పవర్ ఎలక్ట్రానిక్స్ కేంద్రంగా మారుతోందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను ముందుగానే నిమగ్నం చేయడం మరియు ఇంజినీరింగ్ యొక్క సామాజిక విలువకు వారిని బహిర్గతం చేయడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ 2027లో ఈ సదస్సును ద్వైవార్షిక కార్యక్రమంగా మార్చడానికి జాతీయ స్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తుందని తెలియజేశారు.

• మర్యాదపూర్వక భేటీ



రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝిని ఆయన అధికారిక నివాసంలో మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వీరివురు రాష్ట్ర పాలన, అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. సుసంపన్న ఒడిశా ఆవిష్కరణ నేపథ్యంలో ప్రభుత్వ కార్యాచరణను గవర్నర్‌కు వివరించినట్లు సీఎం తెలిపారు. – భువనేశ్వర్

ముక్కు మూసుకొని నడవాల్సిందే..



దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న మహిళ



పేరుకుపోయిన చెత్త

కొరాపుట్: జయపూర్ పట్టణంలోని 20, 21 వార్డుల్లో అపారిశుద్ధ్యం విలయతాండవం చేస్తోంది. ఎక్కడచూసిన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో చెత్తపై వర్షం పడుతుండడం వలన దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అపారిశుద్ధ్యం వలన దోమలు, ఈగల బెడద పెరిగి రోగాలబారిన పడతామని ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రతినెలా సుమారు రు.73 లక్షలు ఖర్చు చేస్తున్నారు. కానీ వ్యయానికి తగ్గ ఫలితం ఉండడం లేదు. వర్షాలు పడుతుండడంతో డ్రైన్‌లు పొంగి రోడ్లపై ప్రవహిస్తున్నాయి. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సైబర్ భద్రతపై అవగాహన అవసరం





మాట్లాడుతున్న గవర్నర్ హరిబాబు అవగాహన సదస్సుకు హాజరైన సభ్యులు

- గవర్నర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: సైబర్ భద్రతపై ప్రజలకు అవగాహన అవసరమని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అన్నారు. రాజ్ భవన్ నూతన అభిషేక్ హాల్‌లో సైబర్ భద్రత – మాదక ద్రవ్యాల వ్యసన నివారణపై ప్రజా అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ప్రసంగించారు. ఆయనతో క్రైమ్ బ్రాంచ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ వినయ్‌తోష్ మిశ్రా, క్రైమ్ బ్రాంచ్ సీఐడీ అదనపు పోలీసు సూపరింటెండెంట్ రితేష్ మహాపాత్రో ఈ అంశాలపై వివిధ రకాల వివరణాత్మక విషయాలు వివరించారు. డిజిటల్ ప్రపంచంలో పెరుగుతున్న నేరాలు ఆందోళనకరంగా మారాయన్నారు. అలాగే మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి కోలుకోవడానికి సమయం, ధైర్యం మరియు సరైన మద్దతు అవసరమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.బి.ఎస్.రాజ్‌పుత్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ డీఐజీ పినాక్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

• స్వామి రాక కోసం

వార్షిక రథయాత్ర సందర్భంగా జగతి నాథుడు సోదర సోదరి సమేతంగా గుండిచా ఆలయానికి తరలి రానున్నారు. దీంతో స్వామిరాక కోసం ఈ మందిరం పునరుద్ధరణ, ఆధునికీకరణ పనులను ఇటీవల ముగించారు. గుండిచా ఆలయం సువిశాల వాకిలి భారీ రంగవల్లులతో ముస్తాబైంది.
– భువనేశ్వర్/పూరీ



• క్రీడాకారులకు సత్కారం



పురస్కారం అందుకుంటున్న ప్రణతి నాయక్



చిన్నారి సాత్విక్‌కు మంత్రి సూర్యవంశీ అభినందన

భువనేశ్వర్: జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో ప్రతిభ ప్రదర్శించిన క్రీడాకారులకు రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ ప్రత్యేక నగదు పురస్కారంతో మంగళవారం సత్కరించారు. 2025 ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ ఆసియా ఛాంపియన్ షిప్ పోటీల్లో సీనియర్ మహిళా వాల్ట్‌లో కాంస్య పతకం సాధించిన జిమ్నాస్ట్ ప్రణతి నాయక్‌ను రూ.75,000లు, 38వ 9 ఏళ్లలోపు చదరంగం ఛాంపియన్ షిప్ – 2025 పోటీలో విజేతగా నిలిచిన బాల క్రీడాకారుడు సాత్విక్ స్వంయికి రూ.30,000ల నగదు బహుమతి అందజేసి అభినందనలు తెలిపారు.

• అధ్వానం

నిత్యం రద్దీగా ఉండే స్థానిక డైలీ మార్కెట్ నుంచి రాణిగుడఫారం, సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంతాలకు వెళ్లే అండర్ గ్రౌండ్ అధ్వానంగా మారింది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బ్రిడ్జి కింద రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహన చోదకులు ఆ మార్గం గుండా రాకపోకలు కొనసాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అందువలన మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– రాయగడ



వాహనదారుల అవస్థలు



గుంతలుగా మారిన రహదారి

జవానుల బలి దానాలు జాతి మరువదు



బీఎస్‌ఎఫ్ జవాన్లతో హీరో సిద్ధాంత్



అమర జవానులకు అంజలి ఘటిస్తున్న సిద్ధాంత్ మహాపాత్రో

కొరాపుట్: జవానుల బలి దానాలు జాతి మరువదని ఒడియా సినీ హీరో, గంజాం జిల్లా దిగపొండి ఎమ్మెల్యే సిద్ధాంత్ మహాపాత్రో అన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని బీఎస్‌ఎఫ్ సెక్టర్ హెడ్ క్వార్టర్‌ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా జవానులను ఉద్దేశించి ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో శాంతి భద్రతలు కరువవ్వడంతో అలజడులతో ఉండేదని గుర్తు చేసుకున్నారు. అయితే బీఎస్‌ఎఫ్ జవానుల రాకతో శాంతి వాతావరణం ప్రారంభమయ్యిందని పేర్కొన్నారు. సమాజ పరిరక్షణలో జవానులు చేసిన బలి దానాలు జాతి గుండెల్లో నిలిచి ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం విధి నిర్వహణలో అమరులైన బీఎస్‌ఎఫ్ జవానులకు అంజలి ఘటించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ డీఐజీ సత్యవాన్ ఖంచి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న డీఎఫ్‌వో సాయి కిరణ్

మల్కన్‌గిరి: జిల్లా డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్(డీఎఫ్‌వో)గా సాయి కిరణ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవుల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న వన మహోత్సవ వారోత్సవాల్లో అనేక ఔషధ మొక్కలు నాటుతామని తెలియజేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు మహా ప్రదర్శన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి తదితరులు

కొరాపుట్: రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ మహా ప్రదర్శన చేస్తుందని జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణిపతి ప్రకటించారు. మంగళవారం జయపూర్ మెయిన్ రోడ్డులోని బంకు మఠం సమీపంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 29వ తేదీన జయపూర్ పట్టణంలోని పారాబెడలో ఉన్న దసరా పాడియా అందుకు వేదిక కానుందన్నారు. కలహండి జిల్లా మీదుగా పీసీసీ ప్రెసిడెంట్ భక్త చరణ్ దాస్ వస్తారన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా నుంచి అన్నిచోట్ల మోటార్ బైక్‌లు అనుసరించి జయపూర్ చేరేసరికి 5,000 బైక్‌ల ర్యాలీ జరుగుతుందన్నారు. కొరాపుట్, మల్కన్‌గిరి, నబరంగ్‌పూర్ జిల్లాల నుంచి సుమారు 40 వేల మందితో సమావేశం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు అజయ్ కుమార్ లల్లూ, రాష్ట్ర వ్యాప్త కాంగ్రెస్ నాయకులు పాల్గొంటారని ప్రకటించారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు పవిత్ర శాంత (లక్ష్మీపూర్), మంగులు కిలో (చిత్రకొండ), మున్సిపల్ చైర్మన్లు నౌరి మహంతి, శంకరరావు తదితరులు ఉన్నారు.

శ్రీముఖలింగం హుండీ ఆదాయం రూ.3.32 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో గడిచిన 112 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.3,32,883 వచ్చినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. పర్యవేక్షణ అధికారి ఆమదాలవలస గ్రూప్ టెంపుల్ అధికారి టి.రవితోపాటు కొమనాపల్లి సత్యసాయి భజన మండలి అధ్యక్షులు పైడిశెట్టి వెంకటరమణ, అర్చకులు వెంకటాచలం, ధనాల స్వామి,భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ 2, 4 సెమిస్టర్ల స్పెషల్ డ్రైవ్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో 2015–18 విద్యా సంవత్సరంలో సీబీఎస్ విధానంలో చదివి డిగ్రీ పూర్తి చేయలేకపోయిన వారికి, 2019లో డిగ్రీలో చేరి ఏవైనా సబ్జెక్ట్‌లు ఉండిపోయిన సప్లిమెంటరీ విద్యార్థులకు సంబంధించి రెండు, నాలుగు స్పెషల్ డ్రైవ్ పరీక్షలను మంగళవారం ప్రారంభించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రతి రోజు జరిగే ఈ పరీక్షలు వచ్చే నెల 7వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షలను రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య పరిశీలించారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జూలై 5న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని, ఇందులో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు, బీమా న్యాయవాదులు, చిట్‌ఫండ్ కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసారి కూడా ఎక్కువ కేసులు పోలీసు వారి దగ్గర నుంచి రావాలని కోరారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కర రావు, 3 వ అదనపు జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్, 4 వ అదనపు జిల్లా జడ్జి ఎస్ ఎం ఫణి కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.



పంచముఖి హనుమంతుడు



హరిహర



మధుసూదన




గిరిగోవర్ధన్ ధారి



పాండు నృసింహ

మహాయాత్రకు ముస్తాబు



అంతిమ దశ తయారీలో జగన్నాథుని నందిఘోష రథం

ఈ ఏడాది జరగనున్న పూరీ జగన్నాథ స్వామివారి రథయాత్రకు రథాల తయారీ ముగింపు దశకు చేరుకుంది. ఏటా కొత్తగా 3 రథాలు తయారు చేయడం ఆనవాయితీ. రథ సారథులు, అశ్వాలు, పార్శ్వ దేవతలకు రంగు పూసి పునర్వినియోగిస్తారు. కొత్త రథాల తయారీ పనులు పూర్తి కావడంతో ఈ పనులు ఊపందుకున్నాయి. చిత్రకారులు, రూపకారులు ఈ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఒక్కో రథానికి 4 చొప్పున గుర్రాలు, 9 వంతున పార్శ్వ దేవతల్ని అమర్చుతారు. శ్రీజగన్నాథుని నందిఘోష రథంలో శంఖం, బలాహక, శ్వేత, హరిద్వార్ అనే 4 గుర్రాలు ఉంటాయి. ఈ రథంలో 9 పార్శ్వ దేవతలకు చోటు కల్పిస్తారు.

– భువనేశ్వర్

ముగింపు దశకు పూరీ రథాల తయారీ



నందిఘోష రథం గుర్రాలు



చింతామణి కృష్ణ



నారాయణుడు



రావణ ఛత్రభంగ



రామాంజనేయులు

రథయాత్ర ఏర్పాట్లు పరిశీలన



రథం పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్



కొరియా ఆశ్రమ పాఠశాలని సందర్శిస్తున్న కలెక్టర్ కీర్తివాసన్

కొరాపుట్: ఆంధ్రా – ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియాలో రథయాత్ర ఏర్పాట్లను కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ పరిశీలించారు. మంగళవారం పొట్టంగి సమితి కొఠియా గ్రామ పంచాయతీలో పర్యటించారు.

విశ్వవ్యాప్త రథయాత్ర ఈనెల 27న జరగనుంది. కానీ కొఠియాలో ఒక రోజు ఆలస్యంగా 28న జరగడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ప్రాంత సమస్య దృష్ట్యా ఇక్కడ రథయాత్రకి ప్రభుత్వమే అన్ని సహాయ సహకారాలు అందిస్తోంది. కలెక్టర్ నిర్మితమవుతున్న రథాన్ని పరిశీలించారు. ఆరోజు ప్రభుత్వం తరుపున అన్ని శాఖల అధికార యంత్రాంగం యాత్ర వద్ద మోహరించాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం కొఠియాలోని సాంఘిక సంక్షేమ పాఠశాల, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు సందర్శించారు.

బీజేపీ మాక్ పార్లమెంట్



మాక్ పార్లమెంట్ జరుగుతున్న దృశ్యం

కొరాపుట్: దేశంలో ఎమర్జెన్సీ పాలనని గుర్తు చేస్తూ జయపూర్ పట్టణంలోని పారాబెడా సెంటర్‌లో ఉన్న బాలకృష్ణ ప్యాలెస్‌లో బీజేపీ యువ మోర్చా విభాగం మాక్ పార్లమెంట్ మంగళవారం ఏర్పాటు చేసింది. ఎమర్జెన్సీకి 50 ఏళ్లు పూర్తయినందున నాటి అరాచకాలు నేటి యువతరానికి తెలియాలనే ఉద్దేశంతో మాక్ పార్లమెంట్ నిర్వహించామని ఒడియా సినీ హీరో, గంజాం జిల్లా దిగపాండి ఎమ్మెల్యే సిద్ధాంత్ మహాపాత్రో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ, ప్రాథమిక విద్యామంత్రి నిత్యానంద గోండో దేశ ప్రధాని హోదాలో విద్యార్థుల ప్రశ్నలకు బదులిచ్చారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మఝి, ఎమ్మెల్యేలు రఘురాం మచ్చో (కొరాపుట్), రుపుదర్ బోత్ర (కోట్‌పాడ్), పార్టీ నాయకులు గౌతం శాంత్ర, బిశ్వ త్రిపాఠి, అభిలాష్ పండా, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



వేదిక మీద సిద్ధాంత్ మహాపాత్రో, మంత్రి నిత్యానంద గోండో, ఎమ్మెల్యేలు రఘురాం, రుపుధర్ తదితరులు

రైతుల ఆందోళన



జయపూర్ ఆర్ఎంసీ కార్యాలయం ఎదుట నిలిచిన వాహనాలు

కొరాపుట్: పట్టణంలో జాతీయ రహదారి 26పై జిల్లా కేంద్ర ఆస్పత్రి సమీపంలో ఆర్ఎంసీ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళనకి దిగారు. ధాన్యాన్ని చిన్న వాహనాలతో తీసుకొస్తున్నారని వాటిని తీసుకోవడానికి అధికారులు నిరాకరించారు. ధాన్యంను పెద్ద లారీల్లో తీసుకు రావాలని సూచించారు. లేకుంటే తమకు అదనపు పనిభారం పడుతోందని అధికారులు చెప్పారు. దీంతో రైతులు తమకు పెద్ద వాహనాలు లభ్యమవ్వడం లేదని వివరించారు. అయినప్పటికీ ధాన్యం తీసుకోవడానికి అధికారులు నిరాకరించారు. దీంతో ఆగ్రహం చెందిన రైతుల రోడ్డుకి అడ్డంగా భైఠాయించారు. రైతుల ఆకస్మిక ఆందోళనతో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ఇలా ముందస్తు ప్రకటన లేకుండా వాహనదారులను ఇబ్బంది పెట్టవద్దని ప్రజలు రైతులను విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి అభ్యర్థనలు పెరగడంతో రైతులు ఆందోళన విరమించారు. ఇది తెలిసిన జిల్లాస్థాయి ఉన్నతాధికారులు వెంటనే రైతుల ధాన్యం తీసుకోవాలని ఆదేశించారు.



రైతుల ఆందోళనతో ట్రాఫిక్ జామ్

అమరులైన గిరిపుత్రులకు నివాళులు

కొరాపుట్: అమరులైన గిరిపుత్రులకు దళిత్ సమాజ్ నివాళులర్పించింది. మంగళవారం సాయంత్రం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కుమిలి గ్రామ పంచాయతీ జందర్ గ్రామంలో స్మారక స్థూపం వద్ద సంతాపం కార్యక్రమం జరిగింది. 2001 జూన్ 24వ తేదీన అక్కడ గిరిజనులు భూ హక్కుల కోసం పోరాటం చేయగా, జరిగిన గొడవల్లో బెంగాలీ శరణార్థుల చేతిలో బన్‌సింగ్ గోండో, అయితర్ రవుత్ అనే గిరిజనులు మృతి చెందారు. దీంతో అప్పటి నుంచి భూ హక్కుల కోసం దళిత్ సమాజ్ ఆవిర్భవించింది. దళిత్ సమాజ్‌కి చెందిన మాజీ ఎమ్మెల్యే సుభాష్ గోండో, సుఖదేవ్ గోండో తదితరులు హాజరై నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

మూల విరాట్‌లకు శ్రీముఖ సేవ

భువనేశ్వర్: ఆషాఢ అమావాస్య చతుర్దశి జగన్నాథుని సంస్కృతిలో ప్రత్యేకమైంది. ఇది అనవసర చతుర్దశి కావడం విశేషం. ఈ సందర్భంగా మంగళవారం గోప్య సేవలు అందుకుంటున్న మూల విరాటులకు శ్రీముఖ సేవ నిర్వహించారు. ఏడాది పొడవునా తరచూ ఆలయ గణాంకాల ప్రకారం నిర్వహించే గోప్య సేవల్లో ఇదొకటి. ఏటా ఆషాఢ అమావాస్య తిథి నాడు ఆలయ సంప్రదాయం ప్రకారం బొనాకొ లగ్గి సేవ నిర్వహిస్తారు. స్నాన పూర్ణిమ నాటి భారీ స్నానం తర్వాత దేవతలు జ్వరంతో తెర చాటుకు చేరారు. అమావాస్య నాటికి 14 రోజులు పూర్తి అవుతుంది. ఈ వ్యవధిలో ఆరోగ్యం కోసం పలు విధాలుగా తైల మర్దన, లేపన పూత ఇతరేతర ఆయుర్వేద వైద్య విధానంలో చికిత్సతో మూల విరాటుల ముఖాలు మసకబారాయి. స్వామి ఆరోగ్యం కోలుకోవడంతో తెర చాటు నుంచి భక్తజనం మధ్య ప్రత్యక్షం కానున్నాడు. శ్రీముఖ అలంకరణతో భక్తుల మధ్య స్వామి ప్రత్యక్షమై నేత్రానందం ప్రసాదిస్తాడు. దైతపతి సేవకులు గోప్య సేవల్లో భాగంగా పంచమి నాడు ఫులూరి తైల మర్దన మరియు ఏకాదశి నాడు దశమూలికల మోదక సమర్పణ వంటి వైద్య విధానాల చికిత్సతో నయం చేశారు. పవిత్ర ఒణొసారొ చతుర్దశి మరియు ఆషాఢ అమావాస్య తిథి పురస్కరించుకుని మంగళవారం శ్రీమందిరంలో చిత్రపటం ప్రతినిధి దేవుళ్లకు బొడొ సింగార ధూపం తర్వాత ఒణొసారొ పౌరాణికం మరియు చొకొట భోగం నివేదించారు. వెంబడి దత్త మహాపాత్రో సేవకులు ఒణొసారొ ప్రాంగణంలోనికి ప్రవేశించి శ్రీముఖ అలంకరణ పూర్తి చేశారు. అనంతరం దైతపతులు లోపలికి తదుపరి సేవలు, ఉపచారాలు కొనసాగించారు.



పతిత పావనుని స్థానంలో పూజలందుకుంటున్న అనంత నారాయణ చిత్రపటం బొడొ సింగార అలంకరణ



శ్రీజగన్నాథుడు

క్లుప్తంగా

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను చెల్లించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్చార్జ్ ఈఓ కె.శిరీష కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఏఆర్ డీఎస్పీగా వై.రవీంద్రా రెడ్డి



ఎస్పీ వకుల్ జిందల్‌ను కలిసిన ఏఆర్ డీఎస్పీ వై.రవీంద్రా రెడ్డి

విజయనగరం క్రైమ్: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీగా వై.రవీంద్రారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ వకుల్ జిందల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి గౌరవ సూచకంగా పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఇంతవరకు ఏఆర్ డీఎస్పీగా ఉన్న యూనివర్స్ రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ వై.రవీంద్రా రెడ్డికి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల పాత్ర చాలా ప్రధానమైనదని, భద్రత, బందోబస్తు, ఇతర అవసరాలకు అనుగుణంగా ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందిని ఎప్పటికప్పుడు విధులకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

క్రికెట్ పోటీల్లో రాణిస్తున్న అక్కాచెల్లెళ్లు



క్రికెట్‌లో రాణించిన అక్కాచెల్లెళ్లు

కొత్తవలస: విశాఖపట్నంలో ప్రస్తుతం జరుగుతున్న అండర్-19 విభాగంలో బాలికల వన్‌డే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీల్లో కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10,8 తరగతులు చదువుతున్న అక్కాచెల్లెళ్లు రాణిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.ఈశ్వరరావు మంగళవారం తెలిపారు. పుష్పలతగౌడ్ (10 వతరగతి) అత్యంత వేగంగా డబుల్ సెంచరీ సాధించినట్లు తెలిపారు. అలాగే చెల్లి హర్షిత గౌడ్ (8వ తరగతి)తో కలిసి 240 పరుగుల భాగస్వామ్యం చేసినట్లు చెప్పారు. పుష్పలతగౌడ్ 144 బాల్స్‌కు గాను 27 ఫోర్స్, 5 సిక్స్‌లతో మొత్తం 215 పరుగులు సాధించిందన్నారు. అలాగే హర్షితగౌడ్ 109లు పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆ అక్కాచెల్లెళ్లను పాఠశాల ఉపాధ్యాయులు గోవిందనాయుడు, గిరి తదితరులు అభినందించారు.

రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, సాధికారత అధికారి డా.కె.కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2025వ సంవత్సరానికి ప్రధానమంతి రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డుకు ధైర్యసాహసాలు, జాతీయస్థాయిలో క్రీడలు, సంఘసేవ, సైన్స్, టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు, వినూత్న మైన సేవలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన/ చేసిన ఐదుసంవత్సరాలకు పైబడి, 18 సంవత్సరాలు లోపు వయస్సు గల పిల్లల నుంచి ఆనలైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆమె వివరించారు. దరఖాస్తులు హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్. జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో జూలై 31వ తేదీలోగా సమర్పించాలని ఆమె పేర్కొన్నారు. సంబంధిత అర్హతలు, ఇతర సమాచారం కూడా వెబ్‌సైట్‌లో లభిస్తుందని ఆమె చెప్పారు.

జగన్నాథుని రథయాత్రకు సర్వంసిద్ధం

- జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష



జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఇన్చార్జ ఈఓ కె.శిరీష తదితరులు

విజయనగరం టౌన్: జగన్నాథస్వామి రథయాత్ర మహోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కె.శిరీష పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సంతపేటలో ఉన్న జగన్నాథస్వామి ఆలయం ఆవరణలో ఉత్సవ కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి జూలై 5వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. 26న గురువారం స్వామివారికి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కళావాహన, బింబ దర్శనం, నేత్రోత్సవం, ప్రసాద వినియోగం పాణింగిపల్లి వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. అదేరోజు సాయంత్రం జగన్నాథస్వామి శాంతి కల్యాణం, రాత్రి స్వామివారిని రథోత్సవానికి సిద్ధం చేయడం, రక్షాబంధనాలు ఉంటాయన్నారు. 27న శుక్రవారం ఉదయం 5 గంటలకు స్వామివారికి సుప్రభాతసేవ, విశేష అర్చనలు, నీరాజనం, 9.30 గంటలకు మేళతాళాలతో స్వామివారి రథారోహణ, రక్షాబంధనాలు, అనంతరం స్వామివారి తొలి రథయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. 28న శనివారం నుంచి జూలై 4వ తేదీ శుక్రవారం వరకూ ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, మహిళా మండలి ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ పారాయణం, జగన్నాథస్వామి వారి చరిత్ర పారాయణం, గోవిందనామస్మరణ ఉంటుందన్నారు. 5న మారు రథయాత్ర జూలై ఒకటో తేదీన మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు శ్రీ మహాలక్ష్మి దేవి తిరువీధి ఉత్సవం, స్వామివారిని దర్శించడం, శ్రీ లక్ష్మీనారాయణ సంవాదం, శీలవిరుపు ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు. జూలై 5న శనివారం మారు రథయాత్ర, అనంతరం దర్శనాలు ఉంటాయన్నారు. జూలై 6న స్వామివారికి ప్రధాన ఆలయంలో సంప్రోక్షణ, శాంతి హోమాలు, ప్రసాద వినియోగం చేస్తామన్నారు. జూలై 10న ఆషాడ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీసత్యనారాయణస్వామివారి సామూహిక వ్రతం నిర్వహిస్తామని, భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రమణి, ఆలయ పూజారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఏ జుగా కార్యక్రమానికి విశేష స్పందన

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమం జిల్లాలో బాగా జరుగుతోందని, గిరిజన ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ నెల 15 నుంచి 30 వరకు డీఏ జుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతిని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు తమకు కావలసిన అవసరాలను, ధ్రువపత్రాలను, మౌలిక వసతులను ఎక్కువగా కోరుతున్నట్లు చెప్పారు. అలాగే పీఎం జన్‌మన్ గృహాలను కోరుతున్నట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం అమలుచేసే పథకాలతో గిరిజన ప్రాంతాల్లో సేవలు, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయమన్నారు. గ్రామ, క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా వివిధ సౌకర్యాలను క్షేత్రస్థాయిలో అందించేలా జిల్లా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

గిరిజనులు వినియోగించుకోవాలి

ఈ నెల 30 వరకు గిరిజనులకు అవసరమయ్యే ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఆయుష్మాన్ భారత్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, కిసాన్ క్రెడిట్ కార్డ్, పీఎం కిసాన్ కార్డులు, జన్‌ధన్ ఖాతా, పీఎం జేజేబీవై, పీఎం ఎస్‌బీవై బీమా కవరేజ్, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ సామాజిక భద్రత పింఛన్లు, ఉపాధిహామీ, పీఎం విశ్వకర్మ, ముద్ర తదితర జీవనోపాధి పథకాలు, పీఎం ఎంవీవై, ఇమ్యునైజేషన్ తదితర స్త్రీ శిశు సంక్షేమ ప్రయోజనాలను గిరిజన ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ వివరించారు. పీవీటీజీ గృహాలు, గిరిజన గ్రామాలను గుర్తించడం, గ్రామ, క్లస్టర్ స్థాయి శిబిరాలను నిర్వహించడం, ఆరోగ్యం, ఆహారం, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, సామాజిక న్యాయం, వ్యవసాయం, రెవెన్యూ ఇతర విభాగాల సమన్వయంతో కార్యకలాపాలు చేపట్టాలన్నారు. ఆధార్, ఈ- కేవైసీ డాక్యుమెంటేషన్ సంబంధిత సేవల కోసం సంబంధిత విభాగాలు పనిచేస్తాయని స్పష్టం చేశారు. ఆధార్‌లో నమోదు కాని వారిని అంగన్వాడీ సిబ్బంది నమోదు చేయించాలని, గ్రామస్థాయిలో ఈ కార్యక్రమం విజయవంతం కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల లక్ష్యంలో ప్రభుత్వం విఫలం

- ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా సంఘం సభ్యులు

విజయనగరం గంటస్తంభం: ఏ లక్ష్యంతో పొదుపు సంఘాలు పెట్టారో ఆ లక్ష్యం నేరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్.రమణి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పుణ్యవతి ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌పీఆర్ భవనంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రమణి మాట్లాడుతూ..డ్వాక్రా సంఘాలను ఏ లక్ష్యంతో ఏర్పాటు చేశారో ఆ లక్ష్యం నెరవేరలేదన్నారు. పొదుపు చేసిన డబ్బులే రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు బ్యాంకులో ఇవ్వడం సరికాదన్నారు. స్త్రీ నిధి రుణాల్లో అనేక లోపాలు ఉన్నాయని ఆరోపించారు. సక్రమంగా కట్టినా అధిక వడ్డీలు తీసుకుంటు న్నారని మండిపడ్డారు. విజయనగరం జిల్లాలోని కళ్లేపల్లి గ్రామంలో రూ.18 లక్షల వరకు అవినీతి జరిగితే ఐద్వా పోరాడి డబ్బులు సుమారు రూ.13 లక్షలు వరకు ఇప్పించినట్లు చెప్పారు. పెన్షన్ ఇస్తామని చెప్పి మహిళల దగ్గర వసూలు చేసిన అభయ హస్తం డబ్బులు ఏమయ్యామని ప్రశ్నించారు. అత్యధిక బ్యాంకులు డ్వాక్రా మహిళాలకు గౌరవం ఇవ్వడం లేదన్నారు. అప్పును సక్రమంగా కట్టిన వారు ఎవరైనా ఉన్నారంటే వారు డ్వాక్రా మహిళలేనన్నారు. పొదుపు మహిళల సమస్యలు పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు పుణ్యవతి, లక్ష్మి, సహాధ్యక్షురాలు ఆర్.కృష్ణవేణి, జిల్లా కమిటీ సభ్యులు జి.అరుణ, కరుణ పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో పనిచేయని ఎంఆర్ఐ

- ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్న రోగులు
- వారం రోజులుగా ఇదే పరిస్థితి

విజయనగరం ఫోర్ట్: గంట్యాడ మండలానికి చెందిన ఎస్.సతీష్ తీవ్రమైన నడుం నొప్పితో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఎముకల విభాగానికి వెళ్లాడు. ఎంఆర్ఐ స్కాన్ అవసరమని వైద్యులు నిర్ధారించారు. అయితే ఎంఆర్ఐ స్కాన్ పనిచేయకపోవడంతో స్కాన్ బాగైన తర్వాత ఆస్పత్రికి రావాలని వైద్యులు చెప్పడంతో వెనుదిరిగాడు. ఇలా అనేక మంది రోగులు ఎంఆర్ఐ స్కాన్ కోసం వచ్చి నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఎంఆర్ఐ స్కాన్ ఆస్పత్రిలో కొద్ది రోజులుగా పనిచేయకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎంఆర్ఐ స్కాన్ పనిచేయకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంఆర్ఐ స్కాన్ ఉన్నప్పటికీ రోగులు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి.

అధిక మొత్తంలో వెచ్చిస్తున్న రోగులు:

ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో ఎంఆర్ఐ కోసం అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒక్కో స్కానింగ్‌కు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు ప్రైవేటు స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ గత్యంతరం లేక రోగులు చేయించుకుంటున్నారు.

త్వరలో బాగు చేయిస్తాం

ఎంఆర్ఐ స్కాన్ ప్రస్తుతం పనిచేయడం లేదు. ఎంఆర్ఐ స్కాన్ అత్యవసరమైన వారికి ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో ఉచితంగా తీయిస్తున్నాం. ఎంఆర్ఐ స్కాన్‌ను త్వరితగతిన బాగు చేయిస్తాం.

డాక్టర్ ఎస్.అప్పలనాయుడు,
సూపరింటెండెంట్, ప్రభుత్వసర్వజన ఆస్పత్రి



సర్వజన ఆస్పత్రిలోని ఎంఆర్ఐ విభాగం గది

పునరావాస సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతు కూలీ సంఘం నాయకులు

పార్వతీపురంటౌన్: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ 2013 భూ సేకరణ చట్టప్రకారం సంపూర్ణమైన పునరావాస సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని కొండ మొదలు సర్పంచ్ చేపట్టిన నిరాహార దీక్షకు సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ముందుగా జిల్లా కేంద్రంలో ఉన్న రహదారిపై ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌కు చేరుకుని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకుడు శ్రీనునాయుడు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ 2013 భూసేకరణ చట్టప్రకారం సమస్యలు పరిష్కరించాలని, నేటికి 18ఏళ్లు గడుస్తున్నా ఏ ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందలేదని, తక్షణమే అందించాలని, నిర్వాసితులందరికీ పునరావాసం కల్పించి డీపట్టా సాగు చేస్తున్న ఆదివాసీలకు పూర్తి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు గిరిజన గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి వ్యాపారి ఆస్తుల సీజ్

విజయనగరంక్రైమ్: జిల్లాలోని రామభద్రపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా కేసులో ప్రధాన నిందితుడైన శెట్టి ఉమామహేశ్వరరావు ఆలియాస్ హుస్సేన్ ఆలియాస్ పుతిన్‌కు చెందిన సుమారు రూ.2 కోట్ల విలువైన స్థిరాస్తులు సీజ్ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ మంగళవారం తెలిపారు. విశాఖలో ఉంటున్న ఉమామహేశ్వరరావు కొంత మంది సహచరులతో కలిసి 147 కేజీల గంజాయిని తరలిస్తూ రామభద్రపురం మండలం కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసినప్పటికీ విచారణలో ఉమామహేశ్వరరావును ప్రధాన నిందితుడిగా గుర్తించి ఈ ఏడాది ఏప్రిల్ 25న పీటీ వారెంట్‌తో అరెస్టు చేశామన్నారు. విచారణలో 2019 నుంచి 2025 మధ్యకాలంలో ఉమామహేశ్వరరావుతో పాటు ఆయన భార్య స్వరూపరాణి, సోదరుడు వెంకటరావు పేరిట రూ.కోటి 89 లక్షల 84,768 ఆస్తులను గుర్తించి సీజ్ చేశామని, ఇంక ఎవరూ కొనుగోలు చేయకుండా చట్టపరమైన నోటీసు జారీ చేశామన్నారు. ఈ కేసు విచారణలో ప్రధాన నింధితుడైన శెట్టి ఉమామహేశ్వరరావుపై అల్లూరి సీతారామరాజు జిల్లా, విజయనగరం జిల్లా, విశాఖ సిటీల్లో 7కు పైగా గంజాయి కేసులు నమోదయ్యా యని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న అదనపు ఎస్పీ సౌమ్యలత, బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, రామభద్రపురం ఎస్సై ప్రసాదరావులను ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు.

పక్కి గ్రామానికి గజరాజుల గుంపు



పక్కి గ్రామ సమీపంలోని పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

బొబ్బిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్న తొమ్మిది ఏనుగుల గుంపు మంగళవారం పక్కి గ్రామ పరిసరాల్లోకి చేరుకున్నాయి. సీతానగరం మండలం నుంచి ముత్తాయివలస, కమ్మవలస, శివడవలస మీదుగా పక్కి గ్రామ పరిసరాల్లోని అరటితోటలకు చేరుకుని ధ్వంసం చేస్తున్నాయి. స్థానిక ప్రజలను అటవీ సిబ్బంది అప్రమత్తం చేశారు.

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి

- ఐసీడీఎస్ పీడీ విమలారాణి

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలవాలని విజయనగరం వన్ స్టాప్ సెంటర్ సిబ్బందికి ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి సూచించారు. వన్‌స్టాప్ సెంటర్‌ను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించారు. ఇంతవరకు ఎంత మందికి సంరక్షణ కల్పించారన్న అంశంపై ఆరా తీశారు. మహిళల సంరక్షణ కోసం టోల్‌ఫ్రీ నంబర్ 181ను సంప్రదించాలనే విషయాన్ని మహిళలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పి.సాయివిజయలక్ష్మి, కౌన్సిలర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎక్కడ?

- 10 రోజులుగా స్తంభించిన రెవెన్యూ సేవలు
- అయోమయంలో పూసపాటిరేగ మండల ప్రజలు



పూసపాటిరేగ తహసీల్దార్ కార్యాలయం

పూసపాటిరేగ: పూసపాటిరేగ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విధుల్లో చేరి రోజు తిరగక ముందే వచ్చిన స్థానానికే మళ్లీ వెనక్కి వెళ్లడంతో పూసపాటిరేగ మండల ప్రజల్లో అయోమయం నెలకొంది. ఈనెల 13వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నుంచి ఎన్వీ రమణ తహసీల్దార్‌గా పూసపాటిరేగలో జాయిన్ అయ్యారు. జాయిన్ అయిన మరుసటి రోజు నుంచే ఏమైందో ఏమో కానీ ఆయన విధులకు హాజరు కావడం లేదు. తహసీల్దార్ కార్యాలయానికి ధ్రువీకరణ పత్రాలతో పాటు వివిధ అవసరాల నిమిత్తం వచ్చిన విద్యార్థులు, ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇంటర్వ్యూలు, విద్యాసంస్థల్లో జాయిన్ అవడానికి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి. కనీసం ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికి ఇచ్చినా ఇబ్బందులు ఉండేవి కావని పలువురు వాపోతున్నారు. గంటల వ్యవధిలో ఉద్యోగంలో చేరడం, వెనక్కి వెళ్లడం ఏమిటనేది అంతు చిక్కని ప్రశ్నగా పూసపాటిరేగ మండల ప్రజలకు మిగిలింది. పూసపాటిరేగ తహసీల్దార్‌గా పనిచేసిన తాడ్డి గోవిందను కలెక్టరేట్‌లోని 'సి' సెక్షన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సాలూరు నుంచి ఎన్వీ రమణ వచ్చి విధుల్లో చేరారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ తహసీల్దార్‌ను రిలీవ్ చేయకుండానే పూసపాటిరేగలో ఆయన విధుల్లో చేరడంతో ఆగ్రహించిన కలెక్టర్ తహసీల్దార్‌ను వెనుక్కి పిలిచారని ఓవాదన వినిపిస్తుండగా, మరో వాదన మాత్రం రాజకీయంగానే తహసీల్దార్‌ను వెనక్కి పంపించారని బలంగా వినిపిస్తోంది. ఏది ఏమైనా పూసపాటిరేగ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నియామకంపై చర్చ జరుగుతోంది. కనీసం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా కనీసం పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కనీసం ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను అయినా నియమించి ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడకుండా సమస్య పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

100 రోజులు పనికల్పించకపోతే చర్యలు

- డ్వామా పీడీ శారదాదేవి



జామిలో ఉపాధిహామీ సామాజిక ప్రజావేదికలో పాల్గొన్న పీడీ శారదాదేవి, అధికారులు

జామి: వేతనదారు కుటుంబానికి 100 రోజులు పని కల్పించకపోతే చర్యలు తప్పవని డ్వామా పీడీ ఎస్.శారదాదేవి ఉపాధిహామీ సిబ్బందిని హెచ్చరించారు. జామి మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం 19వ విడత సామాజిక ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఏప్రిల్ 24 నుంచి మార్చి 2025 వరకు ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీలు నిర్వహించి తయారు చేసిన నివేదికలను చదివి వినిపించారు. మండలంలో రూ.18 కోట్ల 40 లక్షలతో చేపట్టిన పనుల వివరాలను తెలియజేశారు. చాలా గ్రామాల్లో 100 రోజులు పనికల్పించకపోవడం, పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, పనుల కొలతల్లో తేడాలు వంటివి పరిశీలనకు వచ్చినట్లు సమావేశంలో వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మజ, ఎంపీడీఓ ఎన్.అప్పలనాయుడు, ఎస్‌టీఎం కె.సత్యనారాయణ, ఎస్సార్పీ రామచంద్రరావు, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటరమణ, ఏపీఓ కిరణ్మయి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, పలు గ్రామాల సర్పంచ్‌లు, డీఆర్పీలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం



జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు వెళ్తున్న అండర్-18 జట్టు సభ్యులతో జిల్లా అసోసియేషన్ సభ్యులు

పాలకొండ: క్రీడాకారులకు అండగా ఉంటామని కబడ్డీ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పల్లా కొండలరావు అన్నారు. జాతీయ స్థాయి కబడ్డీ అండర్-18 జట్టుకు ఎంపికైన రాష్ట్ర క్రీడాకారులకు మంగళవారం ఆయన అవసరమైన బ్యాగులు, కిట్‌లు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన 10 రోజులుగా ఇక్కడ శిక్షణ పొంది, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడాస్ఫూర్తితో వ్యవహరించి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న హరిద్వార్‌లో జరగనున్న జాతీయస్థాయి అండర్-18 పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు మంగళవారం ఇక్కడి నుంచి బయలు దేరారు. ఈ సందర్భంగా క్రీడాకారులు కొండలరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెన్నపు చంద్రశేఖర్, మాజీ క్రీడాకారులు దూబ వెంకటరమణ, మాజీ పీఈటీ రెడ్డి మాస్టర్ తదితరులు ఉన్నారు.

రైలులోనుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతుడు ఎస్.మనోజ్ (ఫైల్)

సీతానగరం: మండలంలోని చినభోగిలి వద్ద విజయవాడ పాసింజర్ రైలులో నుంచి జారిపడి మంగళవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన భోగిలి గ్రామానికి చెందిన సవరపు మనోజ్(18) విశాఖపట్నం నుంచి విజయవాడ పాసింజర్‌లో వస్తూ సీతానగరం రైల్వేస్టేషన్‌లో దిగాల్సి ఉంది. అయితే స్వగ్రామానికి వచ్చే సమయానికి ముందుగానే రైలులోనుంచి జారిపడి మనోజ్ మృతి చెందినట్లు గుర్తించామని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్లు రైల్వే పోలీసులు తరలించారు.

పురుగు మందు తాగి వ్యక్తి..

కొమరాడ: మండలంలోని కళ్లికోట గ్రామానికి చెందిన మక్కా వ్యాపారినాయుడు(49) ఈనెల 3తేదీన మద్యం మత్తులో పురుగు తాగేయడంతో అస్వస్థతకు గురికాగా పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ అస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. అక్కడినుంచి మెరుగైన చిక్సిత కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య గౌరీశ్వరి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై కొమరాడ ఎస్సై నీలకంఠం మాట్లాడుతూ పోస్టుమార్టం నిమత్తం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి..

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మున్సిపాలిటీలోని వివేకానంద కాలనీ గణేష్ రామ వీధికి చెందిన పతివాడ శ్రీను (52) వ్యాన్ ఢీకొని మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పతివాడ శ్రీను కొత్తవలస శివారులో నూడిల్స్, చికెన్ అమ్ముతూ ఉంటాడు. మంగళవారం మోటార్ సైకిల్‌పై ఇంటి నుంచి పార్వతీపురం పట్టణంలోకి వస్తుండగా రాయగడ రోడ్డులోని సాహు హాస్పిటల్ సమీపంలో రాయగడ నుంచి గుడ్లు లోడుతో వస్తున్న వ్యాన్ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో శ్రీనుకు తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు వెంటనే పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.



పతివాడ శ్రీను (ఫైల్)

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య

రాజాం సిటీ: మండల పరిధి గార్రాజుచీపురుపల్లి గ్రామానికి చెందిన కె.అఖిల (23) మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన కంటు చండీ ప్రసాద్‌కు గరివిడి మండలంలోని మందిరివలస గ్రామానికి చెందిన అఖిలతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. మంగళవారం ఉదయం ఆమెకు ఒక్కసారిగా భరించలేని కడుపునొప్పి రావడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెకు సపర్యలు చేసినప్పటికీ ఫలితంలేకుండా పోయింది. ఈ ఘటనకు సంబంధించి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.